క్లుప్తంగా

గట్టుమల్లన్న ఆలయ హుండీల లెక్కింపు



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో ఉన్న గట్టు మల్లికార్జున స్వామి హుండీలను ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. హుండీలు, వివిధ టికెట్ల ద్వారా గత 30 రోజుల కాలానికి రూ.87,029ల ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ డివిజన్ పరిశీలకులు సంజీవరెడ్డి, పూజారులు వినయ్ శర్మ, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థినికి సీటు



దామెర : మండలంలోని ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 సంవత్సరంలో పదో తరగతి చదివిన కర్ణాటకం సంధ్య బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. విద్యార్థిని మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు 9.8 సాధించిందన్నారు. ఈ సదర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



దామెర : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు రూ. 35వేలు విలువ చేసే ఒక బీరువా, 4 కంప్యూటర్ టేబుళ్లను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాం రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృపాకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నవీన్, పూర్వ విద్యార్థులు అశోక్, నిరంజన్, ప్రసాద్, వీరస్వామి, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ ఇసుక తయారీదారుల అరెస్ట్



ధర్మసాగర్: మండలంలోని రాయిగూడెం గ్రామశివారులో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్న వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి వారు ఉపయోగించిన జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రాయిగూడెం శివారులో అక్రమంగా జేసీబీలతో మట్టిని తవ్వి ఇసుకను వేరు చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దీంతో జేసీబీలను స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మహేందర్ హెచ్చరించారు.

పరామర్శ



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లికి చెందిన మామిండ్ల అభిలాష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. చైర్మన్ వెంట మాజీ ఎంపీటీసీ కడుదూరి రాజు, మాజీ ఉప సర్పంచ్ కొట్టం రాజు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ రాజారపు కుమారస్వామి, మామిండ్ల సంపత్ తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- రక్షణ లేని వ్యవసాయ బావులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైతులు.. పట్టించుకోని అధికారులు



హుజూరాబాద్ రోడ్డు పక్కనే ఎలాంటి రక్షణ లేకుండా ఉన్న వ్యవసాయ బావి



నాగారం రోడ్డు పక్కనే పొదల్లో ఉన్న వ్యవసాయ బావి

పరకాల: నిర్లక్ష్యం అమాయక ప్రాణాల బలిగొంటున్నా కొందరు రైతులకు కనువిప్పు కలగడం లేదు. అధికారులు సైతం చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తయారైంది. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాతనే జాగ్రత్త చర్యలు అంటూ నానా హడావుడి చేయడం బాధ్యులపై చర్యలంటూ చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. పరకాల నుంచి హుజురాబాద్ రోడ్డు, వెల్లంపల్లి రోడ్డు వైపు వెళ్లే ప్రధాన రహదారుల పక్కనే వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల డబుల్ రోడ్డు పనులు, జాతీయ రహదారుల విస్తరణ జరగడంతో ఆయా బావులు మరింత రోడ్లకు దగ్గరకు చేరాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఏ మాత్రం అదుపు తప్పినా అయా బావుల్లోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. మండల కేంద్రం నుంచి నడికూడ వరకు వెళ్లే హుజురాబాద్ రోడ్డు పక్కనే ఐదు వ్యవసాయ బావులు ఎలాంటి రక్షణ లేకుండా పొదల మాటున పొంచి ఉన్నాయి. గ్రామాల్లోకి వెళ్లే రహదారులు మలుపులు ప్రమాదకరంగా మారగా..వాటికి తోడు రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావులు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. ఏడాది క్రితం వెల్లంపల్లి రోడ్డు నుంచి నడికూడ వైపు వచ్చే క్రమంలో భార్యభర్తలతో పాటు వారి మూడేళ్ల కుమార్తె వాహనం అదుపు తప్పి బావిలో పడి మృతిచెందిన సంఘటన గుణపాఠం కాకపోవడం విశేషం. స్కూళ్లు ప్రారంభం కావడంతో గ్రామగ్రామానికి వెళ్తున్న ప్రైవేట్ బస్సులు సమయానికి విద్యార్థులను చేర్చాలనే ఆలోచనతో వేగంగా నడుపుతున్నారు. ఇలాంటి సమయంలో ఏదైనా జరుగరాని ప్రమాదం జరిగితే నష్టం ఊహించని విధంగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



వ్యవసాయ బావులకు రక్షణ గోడలు నిర్మించేలా పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్డు వెంట ఉన్న బావుల రైతులకు నోటీసులు జారీ చేయాలి. లేనిపక్షంలో సంబంధిత రైతులపై చర్యలు తీసుకోవాలి.

– మడికొండ రఘుపతి, ప్రజా సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

అమ్మలా మొక్కలను ప్రేమించాలి



మొక్కను నాటుతున్న డాక్టర్ విజయచందర్ రెడ్డి

దామెర : మొక్కలను అమ్మలా ప్రేమించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ల్యాదళ్ల గ్రామంలో అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని మోదీ ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాంరెడ్డి, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సతీష్, నాయకులు రమేష్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే టీం సందర్శన



వైద్య పరీక్షలు నిర్వహించిన విద్యార్థులతో డాక్టర్ దుర్గా ప్రసాద్, ఉపాధ్యాయులు

ఐనవోలు: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఆరోగ్యపరంగా ప్రత్యేక అవసరాలు కావల్సిన పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రత్యేకంగా గుర్తించిన పిల్లలను ఈనెల 11న గురువారం ఎంజీఎం ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అక్కడ నిర్వహించిన పరీక్షల ఆధారంగా పిల్లలకు అవసరమయ్యే ఆరోగ్య పరికరాలు అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ భవన్‌కుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, మధుకర్, సారయ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మి, విజయ,దినేష్, సీఆర్‌పీ రేవతి పాల్గొన్నారు.

పనివేళల మార్పు జీఓను వెనక్కి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

దామెర : గురుకుల పాఠశాలల్లో పనివేళల మార్పు జీఓను వెంటనే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఒగ్లాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(పరకాల)లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థలకు ప్రభుత్వం ప్రకటించిన పనివేళల్లో శాస్త్రీయత లోపించిందన్నారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచే విధంగా ఉందన్నారు. అద్దె భవనాల్లో సరైన సౌకర్యాలు లేని భవనాల్లో ఇలాంటి పనివేళలు ఎలా అమలవుతాయో ప్రభుత్వం తెలపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, వీరస్వామి, ప్రియ, సౌమ్య, శిరీష, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాలను ఆపలేరు





పోలీసుల అదుపులో ప్రణీత్‌గౌడ్, సురేశ్

ఎల్కతుర్తి : అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాలను ఆపలేరని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పోలీసులు ప్రణీత్‌గౌడ్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచగా అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. అలాగే ఏఐఎస్ఎఫ్ నాయకులను సైతం అక్రమ అరెస్టులు చేసి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేయడంతో అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

అక్రమ అరెస్ట్ చేయడం సరికాదు

శాయంపేట : విద్యార్థి సంఘాల నాయకులపై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్ట్ చేయడం సరికాదని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేశ్ అన్నారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేయకుండా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి సంఘాల నాయకులను శుక్రవారం అక్రమ అరెస్ట్‌లు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకులకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని సురేష్ డిమాండ్ చేశారు.

ప్రజాగ్రహానికి గురైనా మారని కేసీఆర్ తీరు



సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక ఆర్థికవేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

హన్మకొండ: సుమారు పదేళ్లుగా దురహంకార, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాత, రజాకార్ల వంటి కుటుంబ పాలన సాగించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి అప్పుల ఊబిలోకి నెట్టి గత శాసనసభ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై పదవి కోల్పోయిన మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తీరుమాత్రం మారలేదని ప్రముఖ సామాజిక, ఆర్థికవేత్త, తెలంగాణ ఉద్యమకారుడు కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. హనుమకొండలో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని దోచుకొని రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. ఎన్నికల్లో రెండు సార్లు జ్ఞానోదయం కలిగే విధంగా ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ అతనిలో మార్పు రాకపోవడం విచారకరమని ఎద్దేవాచేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కల్వకుంట్ల కుటుంబానికి ప్రజాస్వామ్యంలో ఇక స్థానం లేదని హితవు పలికారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



వేలేరు : మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి మల్లయ్య శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండలంలో జరుగుతున్న పలు పనులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీప్రసన్న,ఎంపీఓ విమల తదితరులు పాల్గొన్నరు.

పాఠశాల విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులు

ధర్మసాగర్: 2023–24 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్ అవార్డులను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు అందుకున్నారు. మిర్రరింగ్ మొబైల్ ఫోన్ కెన్ మేక్ ఏ గుడ్ స్మార్ట్ టెలివిజన్ అంశంపైన 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని చిలుక రిత్విక, ఏ లిఫ్ట్ ఫర్ ప్యాడీ బాగ్స్ లోడింగ్ అనే అంశంపైన ఆకులపల్లి మధుప్రియ ఈ అవార్డులు అందుకున్నారు. శుక్రవారం పాఠశాల అసెంబ్లీలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉమామహేశ్వర్ విద్యార్థులను గైడ్ టీచర్లు కవిత, సురేశ్‌లను అభినందించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎగ్జిబిషన్‌లో జిల్లా తరపున పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి

పరకాల : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి కోరారు. సీజనల్ వ్యాధులపై శుక్రవారం ఆమె ప్రజలకు పలు సూచనలు చేశారు. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్, కలరా వ్యాధుల నివారణ కోసం ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అదే విధంగా మంచి నీ టిని వేడిచేసిన తర్వాత చల్లార్చి తాగాలని కోరారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటిని నిల్వ ఉండకుండా చూడాలని డాక్టర్ స్వాతి కోరారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

వేలేరు : మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు కొయ్యడ మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం హనుమకొండ, వరంగల్ ఇంకా ఇతర పట్టణాల్లోని ప్రైవేట్ కాలేజీలకు వెళ్లి చదువుకోవడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతీ మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మండలంలో ఇప్పటి వరకు కాలేజ్ ఏర్పాటు చేయలేదని విమర్శించారు. మండలంలో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి మండలంలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

ఐనవోలు: అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బండి శ్రీనివాస్(37) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇల్లు నిర్మించుకోవడానికి ప్రైవేట్ బ్యాంకు నుంచి సుమారు రూ.8లక్షలు హోం లోన్ తీసుకున్నాడు. అలాగే గ్రామంలో మరో రూ.12లక్షల వరకు అప్పు చేశాడు. కిస్తులు కట్టడం ఇబ్బందిగా మారడంతో ప్రైవేట్ ఫైనాన్స్ ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నాడు. ఆదాయం సరిపోకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేదని తరచూ మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మంత్రులను కలిసిన రైతు రక్షణ సమితి సభ్యులు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన రైతు రక్షణ సమితి సభ్యులు

ఎల్కతుర్తి : తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఆ సమితి జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతు సమస్యలపై వినతిపత్రం సమర్పించినట్ల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత శ్రేయస్సు కోసం రాష్ట్ర సర్కార్ పని చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటీ చూనన ప్రకారం న్యాయంగా పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, పంట బీమా పంట నష్టం జరిగిన 30 రో జుల్లో జరిగిన నష్టానికి డబ్బులు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కూలీలతో సంబంధం ఉన్న అన్ని వ్యవసాయ పనులకు సంబంధించి రైతుకు 50 శాతం ఖర్చు భరించే విధంగా అనుసంధానం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. రైతులు ప్రైవేట్ అప్పుల బారిన పడకుండా ఉండేందుకు రూ.3 లక్షల వరకు రుణసౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కర్షకులకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందించాలని అభ్యర్థించినట్లు ఆ యన పేర్కొన్నారు. దీనికి వారు సానూకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, సంఘ నాయకులు బాపురావు, జిల్లా అధ్యక్షులు ఉన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ సునీల్

శాయంపేట : పశువులకు వస్తున్న లంబి చర్మవ్యాధి, లోపియా వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్సలు చేయించుకొని పశుసంపదను కాపాడుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ సునీల్ రైతులకు సూచించారు. మండలంలోని సూర్జహాన్‌పల్లిలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మూగజీవాలకు సంక్రమిస్తున్న గాలికుంటు, లోపియా వ్యాధి నివారణకు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ సునీల్ పాల్గొని పశువులకు టీకాలు వేసి మాట్లాడుతూ అంతరించిపోతున్న పశుసంపదను కాపాడేందుకు ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశుసంపద కనుమరుగై పోయి యంత్రాల వైపు మళ్లిస్తున్న తరుణంలో వ్యవసాయంపై ఆధారపడే అనుబంధ రంగాలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పశువులకు వచ్చే వ్యాధులను గుర్తించి అనుభవజ్ఞులైన వైద్యులచే తగిన చర్యలు చేపట్టాలన్నారు. మానవాళికి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు సూచికల ద్వారా చెప్పేటువంటి వివరణ ద్వారా తెలుసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శిబిరంలో డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ పుల్లూరి వంశీకృష్ణ, ప్రజ్వల్ ఉత్పత్తిదారుల సంఘం ప్రాజెక్టు మేనేజర్ వై. ఇన్నారెడ్డి, పశు సంవర్ధక వైద్య సిబ్బంది, బీసీఐ రైతులు, నవయుగ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ వెలుగులు



వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

శాయంపేట : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సెంటర్ హైమాస్ట్ లైట్లకు ఆన్ ఆఫ్ పనిచేయకపోవడంతో నిరంతరం వెలుగులు విరజిమ్ముతున్నాయి, దీంతో ఆరు హైమాస్ట్ లైట్లలో రెండు కాలిపోయాయి. మండల కేంద్రంలోని బీసీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సెంట్రల్ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రి వెలిగి ఉదయం బంద్ కావల్సి ఉండగా హైమాస్ట్ స్తంభాలకు ఏర్పాటు చేసిన టైమర్ పనిచేయకపోవడంతో నిత్యం వెలుగులు విరజిమ్ముతూనే ఉన్నాయి. దీంతో ఆరు లైట్లలో రెండు కాలిపోయి. శాయంపేట స్పెషల్ అధికారి చూసిన కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు హైమాస్ట్ లైట్లకు టైమర్ ఏర్పాటు చేసి చేసి విద్యుత్‌ను ఆదా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒకే మండలానికి రెండు పోలీస్‌స్టేషన్లు

- మండల కేంద్రంలో ఏర్పాటు చేయని అధికారులు
- సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు
- అభివృద్ధికి ఆమడదూరంలో నడికూడ



నడికూడ: జిల్లాల పునర్విభజన చేసినప్పుడు కొత్త మండలాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే పేరుకే కొత్త మండలాలు ఏర్పాటు చేశారు తప్ప ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుపై దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పరకాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మండలాల సంఖ్యను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం నడికూడను 15 గ్రామాలతో నూతన మండలంగా ఏర్పాటు చేసింది. కానీ సొంతభవనాలు లేక ప్రభుత్వ కార్యాలయాలు నడపడానికి ఇంతవరకు మండలంలో భవనాలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతున్న తాత్కాలికంగా ఎంపీడీఓ కార్యాలయం. కాగా కనీసం మండల కేంద్రంలో తాత్కాలికంగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయలేదు. మండలంలోని నర్సక్కపల్లి, రాయపర్తి, పులిగిల్ల, వరికోల్, చర్లపల్లి, నార్లపూర్, వెంకటేశ్వర్లపల్లి, చౌటుపర్తి, ముస్త్యాలపల్లి, నడికూడ గ్రామాలకు పరకాల పోలీస్‌స్టేషన్, సర్వాపూర్, కౌకొండ,. ధర్మారం, రామకృష్ణపూర్ గ్రామాలకు దామెర పోలీస్‌స్టేషన్ పోవాల్సి వస్తుంది. ప్రభుత్వాలు మారినా మండల ప్రజల కష్టాలు తీరడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో సమస్యలు తలెత్తినప్పుడు, చాలా సందర్భాల్లో సెటిల్‌మెంట్‌లతో కాలం వెల్లదీస్తున్నారు తప్ప సమస్యకు పరిష్కారం చూడడం లేదు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తయినప్పటికీ పాలకులు మాటలతో కాలం వెల్లదీస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే అధికారులు స్పందించి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి

మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. స్థల సేకరణ పూర్తయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కనీసం అద్దె భవనంలో అయినా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. రామకృష్ణపూర్, కంఠాత్మకూర్, కౌకొండ, సర్వాపూర్ గ్రామాల ప్రజలు దామెర పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తుంది. వెంటనే నడికూడ మండల కేంద్రంలో నిర్మించాలి.

– ఎరుకల దివాకర్, బీజేపీ నాయకులు,రామకృష్ణపూర్

రెడ్డి బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

హన్మకొండ అర్బన్: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్డి బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, మెరుగు హనుమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఆపై చదువుకునే రెడ్డి కులానికి చెందిన విద్యార్థినులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 28వ తేదీన ఉదయం నిర్వహించనున్న ఇంటర్వ్యూకు సదరు విద్యార్థినితో పాటు తల్లి లేదా తండ్రి తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96766 49811 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.